క్లుప్తంగా

ఉద్యోగాలకు 16 మంది ఎంపిక


జాబ్‌మేళాను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో **ఏపీ** నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 16 మంది యువతి, యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కంటే ప్రైవేట్ కంపెనీలు ఎక్కువ జీతాలు ఇస్తున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్న జాబ్ మేళాకు 67 మంది యువతి, యువకులు హాజరయ్యారు. కాగా 16 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమైక్యతతోనే సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రామారావు

మాకవరపాలెం : ప్రభుత్వ పింఛనుదారులంతా సమష్టిగా ఉన్ననాడే సమస్యలు పరిష్కారం అవుతాయని మండల పింఛనుదారుల సంఘ అధ్యక్షుడు కోసూరు రామారావు అన్నారు. తామరంలో పింఛనుదారులతో ఏర్పాటు చేసిన రామరక్షణ సంఘం 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 లోగా పింఛనుదారులంతా జీవన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. నర్సీపట్నం, కోటవురట్ల సబ్ ట్రెజరీ అధికారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి నేతల అభినందనలు


పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావును కలిసిన నర్సీపట్నం నాయకులు

నర్సీపట్నం : బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన ద్వారపూడి పరమేశ్వరరావుని నర్సీపట్నం అసెంబ్లీ సంయోజక్ గవిరెడ్డి త్రినాథ్, నర్సీపట్నం మండల అధ్యక్షులు బోళెం శివ, అప్పలరాజు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన సదస్సులో సీఐ రేవతమ్మ


మాట్లాడుతున్న నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ

నాతవరం : దేశ వ్యాప్తంగా గంజాయి రవాణా చేస్తుండగా ఎక్కడ పట్టుబడినా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే ఉండడం బాధాకరమని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. మండలంలో కురువాడ గ్రామంలో మంగళవారం గంజాయి అక్రమ రవాణా, సైబర్ నేరాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గంజాయి అంటే పాడేరు ఏజెన్సీ ప్రాంతమే దేశ వ్యాప్తంగా గుర్తుకు వస్తుందన్నారు. ప్రజల నుంచి చైతన్యం వస్తే తప్ప దీని నివారణకు ప్రభుత్వ ఆశయం నెరవేరదన్నారు. ఇటీవల సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తుందన్నారు. మీకు ఎవరైనా ఫోన్ చేసి సమాచారం అడిగితే అనుమానం వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బంగ్రారాజు, ఎస్ఐ భీమరాజు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నూకరాజు పాల్గొన్నారు.

పదింతల కృషితో పదికి పది!

విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైంది. పదో తరగతి పరీక్షల్లో సాధించే మార్కులే పిల్లల భవితకు పటిష్టపునాది వేస్తాయి. గత ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 10కి 10 గ్రేడ్ పాయింట్లు సాధించేలా ఉపాధ్యాయులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

- టెన్త్‌లో ఉత్తమ గ్రేడ్ల సాధనకు ప్రత్యేక శ్రద్ధ
- నిత్య సాధనే కీలకమంటున్న ఉపాధ్యాయులు
- పటిష్ట ప్రణాళికతో బోధన

నర్సీపట్నం : పదో తరగతి పరీక్షలను మార్చి 17 నుంచి నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షలకు నియోజకవర్గం నాలుగు మండలాల్లోని 32 హైస్కూల్స్ నుంచి 2,892 మంది హాజరవుతున్నారు.

ఈ నేపథ్యంలో ఉన్న సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులకు రెండు పూటలా అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన సాగిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. వెనుకబడిన వారిని గుర్తించి సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

కేవలం 60 రోజులే వ్యవధి...

ప్రభుత్వం పరీక్షల తేదీలు ప్రకటించడంతో తొలుత విద్యార్థుల్లో కొంత ఆందోళన మొదలయ్యింది. పరీక్షలు కేవలం 60 రోజులు మాత్రమే ఉండడంతో రోజులు సమీపిస్తున్న కొలదీ పరుగులు పెట్టే కన్నా ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళిక చేసుకుంటే పదో తరగతిలో పదిలంగా గట్టెక్కవచ్చు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎంతో ముఖ్యమని, సాధనలో కీలక అంశాలు ఎన్నో వెలుగులోకి వస్తాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వాటిని నివృత్తి చేసుకోవడంతో పాటు సలహాలు పాటించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చునని చెబుతున్నారు. తదనుగుణంగా బోధన జరుపుతున్నారు. విద్యార్థికి ఇక్కడ పాయింట్లు ఆధారంగానే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పదో తరగతి గట్టెక్కాలంటే పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవమే ప్రధాన మార్గమని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.


పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

భయాన్ని అధిగమించాలి...

సాధారణంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్లమనే భయాన్ని అధిగమించాలి. ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా చదువుకుంటే సులభంగా మార్కులు సాధించవచ్చు. జీవిత చరిత్రలు, గ్రామర్, ఎక్సర్‌సైజ్ అర్థాలు,, వ్యతిరేకార్థాలు, ఏకవాక్య ద్వారా నూరు శాతం మార్కులు పొందవచ్చు. పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టుకోసం స్పెల్లింగ్ తదితర అంశాలపై సాధన చేయాలి. విద్యార్థులను ఏబీసీ గ్రూపులుగా విభజించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

సిహెచ్. తలుపులు, మండల విద్యాశాఖాధికారి

ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తిస్తే ఎంతో మేలు


పాడుగుపాలెంలో సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సన్యాసిరావు

కె.కోటపాడు : కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం సమస్య బారిన పడకుండా మందుల ద్వారా కాపాడవచ్చునని లంకవాని పాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసి రావు అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గల పాడుగు పాలెం, వారాడ గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కుష్టువ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి శరీరంపై రాగి రంగు మచ్చలతో పాటు స్పర్శలేని మచ్చలు ఉంటే వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆయన తెలిపారు. వీరిని వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా పరీక్షలను నిర్వహించడం ద్వారా వ్యాధిని నిర్ధారించడం జరుగుతుందని సన్యాసిరావు అన్నారు. తద్వారా వీరికి ఎండీటీ మాత్రలను అందించడం ద్వారా వ్యాధి నుంచి ఇతరత్రా సమస్యలు రాకుండా చూడడం జరుగుతుందని అన్నారు. ఈ సర్వే కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది ఫిబ్రవరి 2 వరకూ నిర్వహించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం


శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : పాడి రైతులు పశుపోషణలో జాగ్రత్తలను పాటించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. పింద్రంగి గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ పశువైద్య శిబిరంలో గర్భకోశ చికిత్సలు, సాధారణ చికిత్సలతో పాటు చూడి తనిఖీలు, పెయ్యలకు నట్టల నివారణ మందును 85 పశువులకు వేశారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ ప్యాకెట్, మందులను ఉచితంగా అందించారు. పశువులకు పశుసంవర్ధకశాఖ ద్వారా వివిధ సమయాల్లో వేసే వ్యాక్సిన్ల వల్ల పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉంటాయని పశువైద్యాధికారి నాయుడు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, పింద్రంగి పాల సంఘం వేతన కార్యదర్శి జాగరపు అప్పారావు, పశు వైద్య సహాయకులు సంతోష్, ఆదర్ష్, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


బుచ్చింపేట పశువైద్య కేంద్రానికి చికిత్స కోసం తీసుకొచ్చిన గొర్రెలు, మేకలు


తెనుగుపూడిలో పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సామాలు, ఉప సర్పంచ్ పెదనాయుడు


రైతులకు సూచనలు ఇస్తున్న పశువైద్యాధికారి శిరీష

రోలుగుంట : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 20 సోమవారం ప్రారంభమైన పశు ఆరోగ్య శిబిరాలు ఈ నెల 31 తేదీ వరకూ మండలంలో గల అన్ని గ్రామాల్లోను నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి బాలమౌనిక కోరారు. మంగళవారం బుచ్చింపేట గ్రామంలో నిర్వహించిన శిబిరానికి పాడి రైతులు తీసుకొచ్చిన 80 పశువులకు, 20 దూడ పెయ్యిలకు చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. సర్పంచ్ ఉల బాల చంద్ర ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది భవానీ, రమణ, దివ్య, సాయికృష్ణ, శివ, యశోద, నానాజీ పాల్గొన్నారు.

దేవరాపల్లి : పశువుల ఆరోగ్యం, పశు పోషణ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి, మామిడిపల్లి పశువైద్యాధికారి జి. ప్రియాంక పాడి రైతులకు సూచించారు. మండలంలోని తెనుగుపూడి, కలిగొట్ల గ్రామాలలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. తెనుగుపూడిలో ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి, కలిగొట్లలో మామిడిపల్లి పశువైద్యాధికారి జి. ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించారు. తెనుగుపూడిలో జరిగిన పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ తాడి సామాలు, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, కలిగొట్లలో స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ రెండు గ్రామాలలో 89 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరాలలో పశువులకు గర్భకోశ చికిత్స, పెద్ద పశువులకు, దూడలకు నులి పురుగుల నివారణ మందు, వ్యాధి నిరోధక టీకాలను, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపారు. 200 గొర్రెలు, మేకలకు నులిపురుగుల నివారణ మందు, 550 కోళ్లకు వ్యాక్సినేషన్ చేశారు.

కసిమి గ్రామంలో పశువైద్య శిబిరం

గొలుగొండ : కసిమి గిరిజన గ్రామంలో మంగళవారం పశువ్యాధులపై రైతులకు అవగాహన కార్యక్రమంతో పాటు పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 150 గొర్రెలు, 20 పశువులు, పశువులకు టీకాలు వేసినట్లు కృష్ణదేవిపేట పశువైద్యాధికారి శిరీష తెలిపారు. పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. వచ్చే వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి నిండుగొండలో గౌరీపరమేశ్వర్ల ఉత్సవాలు

రోలుగుంట : మండలంలోని నిండుగొండలో ఈ నెల 25 నుంచి 27 వరకూ మూడు రోజుల పాటు శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణమూర్తి, సర్పంచ్ శెట్టి సంధ్య తెలిపారు. ఈ నెల 25 న ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఆ రోజు రాత్రి ఆడబతుకు సాంఘిక నాటకం, 26న ఆదివారం గ్రామంలో స్టేజీ ప్రోగ్రాంలు, 27న ఉత్సవమూర్తుల నిమజ్జనోత్సవం ఉంటాయని మాజీ ఎంపీటీసీ వెంకటరాజారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు లగుడు సత్తిబాబు మంగళవారం విలేకరులకు తెలిపారు.


జీ కోడూరులో చెత్త తొలగింపు


చెత్త తొలగింపు పనులు చేయిస్తున్న కార్యదర్శి రాజారావు

మాకవరపాలెం : మండలంలోని జీకోడూరులో చెత్త తొలగించే పనులు చేపట్టారు. ఈ గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందంటూ గ్రామానికి చెందిన అప్పారావు సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించారు. గ్రామంలో మంగళవారం చెత్త తొలగించే పనులు చేపట్టారు. పాఠశాలలు, వీధుల్లోనూ పేరుకుపోయిన చెత్త కుప్పలను పంచాయతీ కార్యదర్శి రాజారావు దగ్గరుండి తొలగించే పనులు చేయించారు.

సంబరంగా తీర్థ మహోత్సవాలు

చౌడువాడలో ఉత్సాహంగా ఎడ్ల పోటీలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దేవరాపల్లి: కొత్తపెంటలో పైడిమాంబ, సీతంపేటలో మరిడిమాంబ అమ్మవార్ల తీర్థ మహోత్సలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపెంటలో పైడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలను నిర్వహించి విజేతలకు వరుసగా రూ.10వేలు, 8వేలు, 6వేలు, 4వేలు, 2వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీతంపేటలో రెండు రోజుల తీర్థ మహోత్సవంలో భాగంగా తొలి రోజు గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి, విజేతలకు రూ. 20 వేలు, 15 వేలు, 6వేలు, 4వేలు చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మినప పంటలో తెగుళ్లు నివారించాలి


మినప పంటలో తెగుళ్ల నివారణకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవీంద్రనాథ్, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి : మినప పంటను బూడిద, ఆకుముడత తెగుళ్లు ఆశిస్తున్నాయని, తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని చోడవరం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రవీంద్రనాథ్ సూచించారు. మండలంలోని కలిగొట్ల, బోయిలకింతాడ, మామిడిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. మినప పంటలో బూడిద తెగులు ఆశించినట్టు గుర్తించామని, దీని నివారణకు ఒక గ్రాము మైక్రో బుటానిల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, లేదా పెన్కొన జోల్ మందును పిచికారి చేయాలని రైతులకు వివరించారు. మినుములో ఆకుముడత నివారణకు రెండు గ్రాముల థయోమిథాక్షంను, లేదా నాలుగు గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటిలో పిచికారి చేయాలని అన్నారు. నువ్వు పంట సాగు చేసే రైతులు విత్తనాలు వేసే ముందు ఆఖరి దుక్కులో ఎస్ఎస్‌పి 50 కేజీలు, 15 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేసుకోవాలని, తద్వారా మొక్క బాగా ఎదిగి నూనె శాతం పెరుగుతుందన్నారు. మొదటి గొప్పు దశలో ఉన్న వేరుశనగలో ఎకరానికి 200 కేజీల జిప్సం వేసుకుంటే నూనె దిగుబడి బాగుంటుందన్నారు. కార్యక్రమంలో మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూరినాయుడు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల ఏకరువు


మహిళా మార్టులపై సభలో వివరిస్తున్న మాజీ ఎంపీపీ రామధర్మజ

మాడుగుల : మండలంలో ట్రాన్స్‌కో అధికారుల పనితీరు బాగోలేదని, తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని, అలాగే చెరువు గర్భాలు, పంట కాలువలు అక్రమణలో ఉన్నవి వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేపల వృత్తిదారులు, చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలకు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. స్థానిక మహిళా మార్టులో గతంలో రోజుకు సుమారు రూ.లక్ష వరకు కొనుగోలు జరిగేదని, ప్రస్తుతం సంక్రాంతి సీజన్‌లో కూడా రూ.10 వేలు కూడా దాటడం లేదని, దీనిపై వెలుగు ఏపీఎం అప్పలనర్సమ్మ బాధ్యత తీసుకోలేదని మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ ఎసభ దృష్టికి తీసుకువచ్చారు. తాచేరుపై వంతెన నిర్మాణం జరగడం వల్ల పాడేరు నుంచి వచ్చే బస్సు సర్వీసులు మాడుగుల మీదుగా ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వంలో రూ.కోట్లాది నిధులతో రెండు కోల్డ్ స్టోరేజీ భవనాలు నిర్మాణం చేపడితే వాటిలో ఒక దానిని అద్దెకు ఇవ్వకుండా నిరుపయోగంగా ఉంచుతున్నారని అన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మహిళా మార్టును యథాస్థితికి తీసుకురావాలని, పాడేరు నుంచి మాడుగుల మీదుగా ఆర్‌టీసీ బస్సులు నడపాలని, కోల్డ్ స్టోరేజ్ భవనాలను అద్దెకు అందజేసి బాగు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వల్ల తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నా వాటిని సరి చేయడం లేదని కింతలి ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు అన్నారు. దీంతో విద్యుత్ సమస్యలపై చాలావరకు ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ రాంబాబును ఆదేశించారు. తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే జరిగే సమయంలో రైతులు అందుబాటులో ఉంటే సమస్యలు పరిష్కారం చేయగలుగుతామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించడం లేదని ఎంపీటీసీ విజయలక్ష్మి సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో కొంకి అప్పారావు, మాజీ ఎంపీపీ రామధర్మజ, వ్యవసాయాధికారి వాసుదేవ రావు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఆధార్ కార్డులు అందేలా చూడండి


లోపూడి సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో విజయలక్ష్మి

బుచ్చెయ్యపేట : మండలంలో గల లోపూడి సచివాలయంలో ఆధార్ క్యాంపు కార్యాలయాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సేవలు ఎలా అందిస్తున్నది ఎంపీడీవో పరిశీలించారు. ఆధార్ కేంద్రంలో పిల్లలందరికి ఆధార్ సేవలు సక్రమంగా అందించాలన్నారు. ఆధార్ కార్డులు లేనివారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, సిబ్బంది శైలజ, శేఖర్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను చాటిచెప్పేలా తీర్థాలు


విజేతలకు బహుమతులు ఇస్తున్న పారిశ్రామికవేత్త బంగ్రారాజు, సీఐ రేవతమ్మ


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు, సీఐ రేవతమ్మ

నాతవరం : పూర్వ ఆచారాలు నేటి తరాలకు చాటి చెప్పే విధంగా తీర్థాల సందర్భంగా ముగ్గుల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని నర్సీపట్నానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విద్యావేత్త బంగ్రారాజు అన్నారు. తాండవ గ్రామంలో మంగళవారం తీర్థం సందర్భంగా రామాలయం వద్ద మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. సుమారుగా 26 మంది మహిళలు పాల్గొని వివిధ ముగ్గులు వేశారు. తాండవ గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన మహిళా ఉపాధ్యాయులు, నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ భీమరాజు, మాజీ ఎంపీటీసీ నూకరాజు, నీటి సంఘం మాజీ డైరెక్టరు సత్యనారాయణ, పీసా కమిటీ అధ్యక్షుడు పాసిల అప్పారావు, టీడీపీ నేత అప్పన విజయ్ పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు


పట్టుబడ్డ పందెంరాయుళ్లతో ఎస్ఐ భీమరాజు, సిబ్బంది

నాతవరం : గన్నవరం సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా కోడి పందాలు ఆడుతున్న వారిపై దాడి చేసి పట్టుకున్నామని నాతవరం ఎస్ఐ భీమరాజు విలేకరులకు తెలిపారు. మంగళవారం గన్నవరం వై.బి.పట్నం గ్రామ సరిహద్దులో కోడి పందాలు ఆడుతున్నట్లు ముందస్తు సమాచారంతో దాడి జరపగా ముగ్గురు వ్యక్తులు, రెండు కోడి పుంజులతో పట్టుబడ్డారని తెలిపారు. మిగిలిన వారు పరారయ్యారని తెలిపారు. ఎక్కడైనా గుట్టుగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సమీప గ్రామాల ప్రజాప్రతినిధులను ఆదేశించామని తెలిపారు.

ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలి


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం : ప్రభుత్వం అందించే పథకాలు పొందాలంటే ప్రతి రైతు ఫార్మర్స్ రిజిస్ట్రీ ద్వారా గుర్తింపు కార్డు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ టి.శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలో యరకన్నపాలెం, కొత్తలక్ష్మీపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి రైతు సేవ కేంద్రంలో కార్డుల జారీ చేసే ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకు అయిన ఫోన్ నెంబరు అందించాలన్నారు. పీఎం కిసాన్ పొందే రైతులు మార్చి 31వ తేదీలోగా గుర్తింపు నెంబర్ తీసుకోవాలన్నారు. ఖరీఫ్ వరి కోతల తరువాత అపరాలు, జనుములు వేసుకుంటే భూమి సారమవుతుందన్నారు. పశువైద్యాధికారి నరేష్ పశువుల్లో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.

మహిళలపై దాడుల నివారణకు చర్యలు


మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీగౌరి

నాతవరం : మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీగౌరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళలపై లైంగిక వేధింపులు నిరోధం, పరిష్కారం చట్టం 2013 పోక్సో యాక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల ప్రకారం పోక్సోయాక్టుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా కమిటీలు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టడం, ప్రతి ఒక్కరూ చదువుకోవడం వంటి అంశాలను విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ ఎంఈవో వరహాలబాబు పాల్గొన్నారు.